క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని డీజీ పేటలో నూతనంగా నిర్మించనున్న కోదండరామస్వామి నూతన ఆలయానికి ఆదివారం అర్చకులు పంచాగ్నుల రామమూర్తిశర్మ వేద మంత్రాలతో భూమిపూజ చేశారు. తొలుత గణపతిపూజ, పుణ్యాహవచనం, గర్తరిపూజ నిర్వహించి అనంతరం భూమిపూజ శిలను ఉంచి పంచామృతం, నవధాన్యాలు వేసి భూమిపూజ పూర్తిచేశారు.

ముగిసిన పేరంటాలమ్మ తల్లి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణతో ఊరేగుతున్న పేరంటాలమ్మ తల్లి

పీసీపల్లి: మండల పరిధిలోని మురుగమ్మి, నేరేడుపల్లి గ్రామాల్లో వెలసిన అడవి పేరంటాలమ్మ తల్లి తిరునాళ్ల ఆదివారంతో ముగిసింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కుబడి ఉన్న వారు పూలబండ్లను కట్టి తీర్చుకున్నారు.

90 మందికి నేత్ర పరీక్షలు



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

టంగుటూరు: రావూరి వినీల మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బ్రహ్మం గారి గుడి ఆవరణలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, గుంటూరు శంకర కంటి ఆస్పత్రి సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 90 మందికి కంటి పరీక్షలు చేయగా 42 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని వైద్యులు గుర్తించారు. అనంతరం వారిని ఆస్పత్రి వాహనంలో గుంటూరుఆస్పత్రికి తరలించారు. అనంతరం స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ కాలేజీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులు 14 మందికి దుస్తులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు రావూరి తిరుమల రాధాకృష్ణ, రావూరి రమేష్ బాబు, రావూరి చంద్రశేఖర్, మౌనిక, శిరీష, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించకుంటే ఉద్యమం

కొండపి: ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లు తీసుకువచ్చి మా ఉపాధి కోల్పోయేలా చేస్తుంది అని, దానికి ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించకపోతే ఉద్యమం తప్పదని ఏఐటీయూసీ అనుబంధ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్స్ యూనియన్ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి కుంచాల సిద్ధయ్య హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొండపి మండల విద్యుత్ రీడర్లు నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ ఇటీవల జరిగిన మహాసభలో మాకు ఉపాధి కల్పించకపోతే భవిష్యత్ కార్యాచరణను రాష్ట్ర కమిటీ తీర్మానించిందన్నారు. మా సమస్యలపై ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా న్యాయం చేయలేదన్నారు. ఈ నెల 15 నుంచి 27వ తేదీ వరకు జిల్లాలోని విద్యుత్ ఉన్నతాధికారులకు, కలెక్టర్లకు మరోసారి వినతిపత్రాలు అందజేస్తామని, అప్పటికీ మా డిమాండ్లు పరిష్కరించకుంటే ఏప్రిల్ 1 నుంచి సమ్మెలోకి దిగుతామని హెచ్చరించారు. ఏప్రిల్ 4న చలో విజయవాడ పిలుపుతో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో రీడర్స్ మల్లికార్జున, వంశీకృష్ణ, మధు, కుమార్, శివ, చరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉలవపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో తహశీల్దార్ కార్యాలయంలో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నారు. నేటి నుంచి తహశీల్దార్ కార్యాలయంతో పాటు మండల పరిషత్ కార్యాలయంలో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని తెలిపారు. మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో తెలియజేయాలని కోరారు.

టెన్షన్ వద్దు.. విజయమే హద్దు..



స్టడీ తరగతుల్లో పది విద్యార్థులు

- పది పరీక్షలకు పక్కా సిద్ధం
- మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు
- గడువు సమీపిస్తుండటంతో విద్యార్థుల్లో ఆందోళన
- భయం వీడి చదవాలని ఉపాధ్యాయుల సూచన

కనిగిరిరూరల్:

పదో తరగతి పాసైతే విద్యార్థి జీవితంలో తొలి మెట్టు ఎక్కినట్లే. ఆ తర్వాత ప్రతి ఏడాది పబ్లిక్ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఏ ఉద్యోగానికి అయినా టెన్త్ ఉత్తీర్ణతే ప్రమాణికంగా, తొలి అర్హతగా పరిగణిస్తారు. అందుకే ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్ణయించుకొని ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలి. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇంకా 15 రోజుల సమయం మాత్రమే ఉండటంతో ప్రతి సబ్జెక్టును రివిజన్ చేసుకుంటే విజయం సునయాసంగా మారుతుంది. ముఖ్యంగా ఒత్తిడికి గురి కాకుండా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సబ్జెక్టు నిపుణులు చెబున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8.15 నుంచి 9.15 వరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు రోజుకో సబ్జెక్టు చొప్పున వారానికి 7 సబ్జెక్టుల రివిజన్ చేయిస్తున్నారు. ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులపై దృష్టి పెట్టి వారికి తగు సూచనలు చేయాల్సి ఆవశ్యకత ఉంది. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో మిగిలిన కొద్ది పాటి సమయాన్ని సంపూర్ణంగా, సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పది విద్యార్థులకు చైతన్యం.. అవగాహన కల్పించాలి. తద్వారా మంచి ఫలితాలు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

నియోజకవర్గంలో పరీక్ష కేంద్రాలు
కనిగిరి-10, హెచ్‌ఎంపాడు-2, పీసీపల్లి-2
సీఎస్‌పురం-2, వెలిగండ్ల-5, పామూరు-5
పరీక్ష రాసే విద్యార్థుల సంఖ్య-3,710

డీసీఈబీ మెటీరియల్‌తో పక్కా పాస్

వంద రోజుల ప్రణాళికాలో భాగంగా ప్రతి పాఠశాలలో స్టడీ అవర్స్, ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశాం. ప్రభుత్వం విడుదల చేసిన డీసీఈబీ మెటీరియల్‌ను విద్యార్థులు చదివితే పక్కాగా ఉత్తీర్ణత సాధిస్తారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి తర్ఫీదు ఇస్తున్నాం. పరీక్షల సమయంలో విద్యార్థులు తప్పనిసరిగా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఉన్న కొద్దిపాటి సమయాన్ని వృథా చేయకుండా జాగ్రత్తలు, చర్యలు చేపట్టాలి.

– శ్యామ్యూల్ జాన్ మార్క్, ఇన్‌చార్జి డిప్యూటీ డీఈఓ కనిగిరి

రివిజన్ చేసుకోవాలి



విద్యార్థులు ప్రస్తుతం రివిజన్‌తో పాటు ప్రశ్న, జవాబులను రెండు మూడు సార్లు రాయడం వల్ల పూర్తి స్థాయిలో గుర్తుంటుంది. పరీక్షలు రాసేటప్పుడు ప్రశ్నను బాగా చదివి అర్థం చేసుకొని సమాధానం రాయాలి. చేతి రాతపై ప్రత్యేక దృష్టి సారించాలి.

పి.రాజ్‌కుమార్, హిందీ టీచర్, దిరిశవంచ జెడ్పీ ఉన్నత పాఠశాల

ఒత్తిడికి దూరంగా ఉండాలి:



ప్రతి పరీక్షకు మధ్య ఒక రోజు సెలవు రావడం వల్ల ఒత్తిడి బాగా తగ్గించుకునేందుకు అవకాశం. విద్యార్థులు ఈ సమయాన్ని వినియోగించుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి. ఇతరులతో పోల్చుకొని నిరుత్సాహ పడకూడదు. విజయం సాధిస్తున్నామనే ఆత్మ విశ్వాసంతో ఉండాలి.

రాజాల కొండారెడ్డి, ఎంఈఓ, సీఎస్‌పురం

వందశాతం ఉత్తీర్ణత సాధనకు కృషి:



పదిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. అందుకు అనుగుణంగా ప్రతి రోజు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. ప్రణాళికాబద్ధంగా చదివిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి తరీ్ఫదు చేస్తున్నాం.

యువీ నారాయణరెడ్డి, ఎంఈఓ కనిగిరి

వినోదాలకు విరామం ఇవ్వండి:



కష్టపడి చదవాలని రాత్రిళ్లు ఎక్కువగా మేల్కొని ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దు. సినిమాలు, టీవీలు, ఇతరాత్ర వినోద కార్యక్రమాలకు పరీక్షలు ముగిసేంత వరకు దూరంగా ఉండాలి.

దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్ సీపీ అంగన్‌వాడీ విభాగం జిల్లా అధ్యక్షురాలు గోవిందమ్మ



కనపర్తి గోవిందమ్మ

పొన్నలూరు: ఎన్నికల సమయంలో ప్రజలు, మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు కనపర్తి గోవిందమ్మ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. మహాశక్తి పథకం ద్వారా ప్రతి మహిళలకు నెలకు రూ.1500, ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా వాటి సంగతే మర్చిపోయారన్నారు. తల్లికి వందనం, ఏడాదికి మూడు ఫ్రీ గ్యాస్ సిలిండర్ల పథకాలకు కూడా అరకొర నిధులు కేటాయించి దగా చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేసి మాట నిలబెట్టుకున్న చరిత్ర సీఎం చంద్రబాబుకు లేదన్నారు. అధికారం కోసం ప్రజలకు అబద్ధపు వాగ్దానాలు చేసి అధికారం వచ్చిన తరువాత వాటిని పట్టించుకోకపోవడం సీఎం చంద్రబాబు నైజమన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోతే ప్రశ్నిస్తానన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సీఎం చంద్రబాబుకు భజన చేయడం తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. అర్హులందరికీ ఉచిత సిలిండర్లు ఉత్తి మాటేనన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రజలను, వైఎస్సార్ సీపీ కార్యకర్తలను భయంభ్రాంతులకు గురిచేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారు తప్ప ప్రజలకు, మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పథకాలు ఇవ్వకూడదని, వారికి ఎలాంటి పనులు చేయకూడదని పబ్లిక్‌గా సీఎం చంద్రబాబు చెప్పడం రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత రాజకీయ బేధాలు లేకుండా అందరికీ నవరత్న పథకాలను అందజేశారన్నారు. కూటమి ప్రభుత్వ చేష్టలను, రాజకీయ దాడులను ప్రజలను గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

‘అపూర్వ’ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

పొన్నలూరు: మండలంలోని చెరువుకొమ్ము పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం మళ్లీ అదే పాఠశాల్లో కలుసుకున్నారు. ఈ ఆత్మీయ కలయికకు అప్పటి విద్యార్థుల్లోని కనపర్తి మోహన్, ఉప్పటూరి మల్లీశ్వరి, మడతల పుష్ప చొరవ తీసుకొని ముందుకు వచ్చి తమతో చదువుకున్న విద్యార్థులతో సంప్రదింపులు చేసి ఒకచోటకు తీసుకొచ్చారు. ఈ ఆత్మీయ కలయిక ఒకరికొకరు ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలతో సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. 2014–15 పదవ తరగతి చదివిన వీరంతా పాఠశాల్లో కలుసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు విచ్చేసి తమకు విద్యాబోధన చేసిన గురువులకు ఘనంగా స్వాగతం పలికారు. పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకొని అప్పటి హెచ్‌ఎం డీఎస్‌కేవీ ప్రసాదరావుతో పాటు ఉపాధ్యాయులకు పాదాభివందన చేసి ఘనంగా సన్మానించి జ్ఞాపకలను అందజేశారు.

నిధులు కేటాయించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నేతలు

పీసీపల్లి: పాలేరు రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల సెంటర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకుడు నారపరెడ్డి మాలకొండయ్య మాట్లాడుతూ బడ్జెట్‌లో నిధులు సవరించి పాలేరు రిజర్వాయర్ కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులంతా నిధుల సాధనకు కృషి చేయాలని కోరారు. పాలేరు రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేయడం వల్ల సుమారు 15 గ్రామాలకు తాగునీటి సమస్య తీరుతుందన్నారు. కాలువలు నిర్మిస్తే మరో రెండు వేల ఎకరాల్లో పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. మండలాన్ని వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో చేర్చాలని డిమాండ్ చేశారు. గత 14 ఏళ్లుగా లంకా రప్రాయంగా, రికార్డులకే పరిమితం అయిన నిమ్జ్ ప్రాంతంలో పారిశ్రామిక పనులు జరగలేదన్నారు. కార్యక్రమంలో కరణం రామారావు, చొప్పరపు మాలకొండయ్య, నారపరెడ్డి చినమల కొండయ్య, కొడవటికంటి కొండయ్య , సంగన వీరస్వామి, గుంటగాని స్టీఫెన్, సగిలి నాగార్జున, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకం, గోపూజ



అభిషేకం చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామికి అభిషేకం అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ పంచామృతాలతో స్వామి ఉత్సవమూర్తికి అభిషేకం చేశారు. గోశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామికి సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మనేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు పాల్గొన్నారు.



మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: విద్యార్థి దశలోనే బాలికలు, మహిళా చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని న్యాయవాది, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా స్థానిక సమీకృత బాలికల వసతి గృహంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల గురించి వివరించారు. పీసీపల్లి ఎంఈఓ జి.సంజీవి మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని.. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలన్నారు. బాల్య వివాహాల నిషేధంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అధికారి జయంతి, వివిధ సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో శిక్షణ తరగతులు

పీసీపల్లి: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని టైలరింగ్‌లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. 90 రోజుల పాటు శిక్షణ ఇచ్చి అనంతరం కుట్టుమిషన్లు అందజేస్తామన్నారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వారు శిక్షణ తరగతులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

10 మద్యం బాటిళ్లు స్వాధీనం

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండల కేంద్రంలో అక్రమంగా మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్న కె కిషోర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సింగరాయకొండ ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి తెలిపారు. ఇతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు వివరించారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం ఖాదరున్నీసాబేగం

సీఎస్‌పురం(పామూరు): పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించి ప్రభుత్వ పాఠశాలల సత్తాచాటాలని హెచ్‌ఎం షేక్.ఖాదరున్నీసాబేగం అన్నారు. సీఎస్‌పురం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆదివారం పాఠశాల వార్షికోత్సవం, 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రానున్న 15 రోజుల్లో ఒక ప్రణాళికా ప్రకారం చదివి మెరుగైన ఫలితాలు, మార్కులు రాబట్టాలన్నారు. ఇప్పటికే విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని చదివిస్తున్నామని, రానున్న రోజులు మరింత పకడ్బందీగా విద్యాభ్యాసం చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాములపాటి వెంకటనరసయ్య, బొబ్బూరి రమేష్, పఠాన్ ఖాజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కందుకూరు కోర్టు పరిధిలోనే కొనసాగించాలి



జస్టిస్ మన్మథరావుకు విజ్ఞప్తి చేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

సింగరాయకొండ: కందుకూరు సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు పరిధిలో ఉన్న సింగరాయకొండ, పొన్నలూరు, జరుగుమల్లి, కొండపి మండలాల అప్పీలు పరిధిని ఒంగోలు జిల్లా కోర్టుకు మారుస్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీసుకున్న నిర్ణయాన్ని పునఃపరిశీలించేలా సహకరించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. మన్మథరావుకు ఆదివారం ఆయన నివాసంలో కందుకూరు బార్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మండలంలో త్వరలో ప్రారంభమయ్యే అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అప్పీలు పరిధిని ఒంగోలు కోర్టుకు ఇవ్వకుండా కందుకూరు కోర్టుకు ఉండే విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు వీవీ సుబ్బారావు, సీహెచ్ హరికృష్ణ, కె.హరి కోటేశ్వరరావు, బక్కముంతల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పుస్తకాలు చదివితేనే విజ్ఞానం పెంపు



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ఉలవపాడు: విద్యార్థులు పుస్తకాలను విరివిగా చదవాలని గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయం, చాకిచర్ల బుక్ కీపింగ్ సెంటర్‌లో చదవడం మాకిష్టం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదవాలన్నారు. గ్రంథాలయాలకు వచ్చి చదవడం వలన జ్ఞానం పెరుగుతుందన్నారు. గ్రంథాలయాల్లో మంచి విలువైన పుస్తకాలు ఉంటాయన్నారు. జనరల్ నాలెడ్జి, నీతికథలు, మహనీయుల చరిత్రలు చదవాలన్నారు. విద్యార్థుల చేత పుస్తకాలు చదివించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చి పనులు చేసుకోండి

- రైల్వే పనులు అడ్డుకున్న బాధితులు
- కనీసం నోటీసులు ఇవ్వకుండా ఇళ్లు ఖాళీ చేయమంటే ఎలా..
- ఒక్కొక్కరికి రెండు ఇళ్ల పట్టాలు, పరిహారం నగదు ఇస్తామని ఇవ్వలేదు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీరాం



పనులు అడ్డుకుంటున్న బాధితులు

కనిగిరిరూరల్: ‘ సుమారు 25 ఏళ్ల నుంచి ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నాం.. మేమంతా రైతు, కూలీలం.. ఎంతో కష్టపడి గృహాలు నిర్మించుకున్నా.. కనీసం మాకు నష్ట పరిహారం ఇవ్వకుండా రైల్వేపనులు చేపడుతున్నాం. ఇళ్లు ఖాళీ చేయమంటే మేం ఎక్కడికి వెళ్లాలంటూ పేరంగుడిపల్లి రైల్వే బాధితులు ఆదివారం పనులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే..నడికుడి- కాళహస్తి రైల్వేలైన్ కనిగిరి వయా పేరంగుడిపల్లి మీదుగా వెళ్లే రైలు మార్గంలో పేరంగుడిపల్లికి చెందిన సుమారు 10 గృహాలు కోల్పోతున్నారు. అయితే వీరికి ప్రభుత్వం , రైల్వే అధికారులు ఎటువంటి సహాయం అందించకుండా.. కంటి తుడుపు చర్యలు చేపట్టి ఇళ్లు కూల్చి వేసి.. స్థలాన్ని ఖాళీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దీన్ని నిరసిస్తూ రైల్వే నిర్వాసితులు అనేక మార్లు తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ రైల్వే అధికారులకు విన్నవించారు. అయినా కనీస స్పందన లేదు. కంటితుడుపు సెంటున్నర పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకునేందుకు చర్యలు చేపడుతున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ రైల్వే బాధితులు కనీసం నష్టపరిహారం ఇవ్వకుండా తమకు ఎటువంటి న్యాయం చేయకుండా ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని రెవెన్యూ, రైల్వే అధికారులు వత్తిడి చేస్తూ.. పనులు చేపట్టేందుకు రంగంలోకి ఆదివారం దిగారు. దీంతో రైల్వే బాధిత కుటుంబీకులు ఇ మాలకొండయ్య, ఇ శ్రీనివాసులు, ఇ శ్రీహరి, సరస్వతి, అంబటి వెంకటయ్య, ఏ వెంకటేశ్వర్లు తదితరులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ప్రభుత్వ అభివృద్ధికి తాము సహకరిస్తామని.. అయితే సుమారు 25 క్రితం పట్టాలు పొంది లక్షల రూపాయలు ఖర్చు పెట్టి గృహాలు నిర్మించుకున్న తమకు న్యాయం చేసిన తర్వాతే రైల్వే పనులు చేపట్టాలని బాధితులు వెల్లడించారు. దీంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. బాధితులకు న్యాయం చేసి, నష్టపరిహారం చెల్లించిన తర్వాతే రైల్వే పనులు చేపట్టాలని సీపీఎం జిల్లా నాయకులు పీవీ శేషయ్య తెలిపారు.